క్లుప్తంగా

చెత్తరహితంగా తీర్చిదిద్దుదాం


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణాన్ని చెత్త రహితంగా తీర్చిదిద్దుదామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు అన్నారు. స్వచ్ఛా తాహీ సేవాలో భాగంగా ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ రవి కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య ఆధ్వర్యంలో స్వచ్ఛతా లీగ్ 2.0, సఫాయ్ మిత్ర సురక్ష షివిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాత మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీ సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చెత్త రహిత, మురికి రహిత మున్సిపాలిటీగా మార్చడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకు ప్రజల సహకారం, పాలక వర్గం తోడ్పాటు కావాలన్నారు.

ఘనంగా ఏఎన్‌ఆర్ జయంతి


ఏఎన్‌ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పెన్షనర్లు

గుంతకల్లు: స్థానిక అంజుమన్ రోడ్డులోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం అక్కినేని నాగేశ్వర రావు (ఏఎన్‌ఆర్) జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగేశ్వరరావు సినీ రంగానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఈఓ రాముడు, ప్రధాన కార్యదర్శి జీవీఎం చలపతి, సభ్యులు విశ్వనాథ్, గంగరాజు, కమలనాథుడు, శాంతిలాల్ పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్‌ను తొలగించాలని వినతి

గుంతకల్లు రూరల్: పట్టణంలోని సీఐటీయూ కాలనీలో ఉన్న 64వ రేషన్ షాపు ఎండీయూ ఆపరేటర్ రమాకాంత్‌ను తొలగించాలని పట్టణ పౌరుల సంఘం నేతలు బుధవారం సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. నాయకులు మారుతీ ప్రసాద్, చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎండీయూ ఆపరేటర్ రమాకాంత్ రేషన్ పంపిణీ సమయంలో మద్యం సేవించి వస్తున్నాడని, ప్రతి 20 కిలోలకు 3 కిలోల చొప్పున బియ్యం తక్కువ వేస్తున్నాడన్నారు. అదేమని అడిగితే మద్యం మత్తులో మహిళలపై దుర్భాషలాడుతున్నాడన్నారు.

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి


నిరసన దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గుంతకల్లు రూరల్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకుడు నరసింహులు మాట్లాడుతూ ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయండి


వర్క్‌షాపులో మాట్లాడుతున్న ఆర్డీఓ రవీంద్ర

గుంతకల్లు రూరల్: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రభుత్వ ఉద్యోగులు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆర్డీఓ రవీంద్ర సూచించారు. బుధవారం స్థానిక వైకేపీ కార్యాలయంలో డివిజనల్ స్థాయి వర్క్‌షాపు నిర్వహించారు. గుంతకల్లు డివిజన్‌లోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఐసీడీఎస్ సిబ్బంది, మెడికల్ ఆఫీసర్లు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఎంపీడీఓ వెంకటరమణప్ప మాట్లాడుతూ మహమ్మారిలా సమాజాన్ని వేధిస్తున్న ఈ సమస్యను అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థల ద్వారా బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయొచ్చన్నారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం అందితే వాటిని ముందే ఆపే అవకాశం ఉంటుందన్నారు. బాల్య వివాహాలతో జరిగే అనర్థాలను తల్లిదండ్రులు అర్థం అయ్యేలా వివరించాలన్నారు.

గంగ ఒడికి గణనాథుడు

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్ఎస్‌తో పాటు చెట్నేపల్లి, ఎస్ఎస్‌పల్లిలో బుధవారం గణనాథుల నిమజ్జన కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు. సుమారు 100 వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయగా 80 శాతం విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఇన్‌చార్జ్ సీఐ రాజశేఖర్‌రెడ్డి పోలీసు సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు. గణపతి బప్పా మోరియా అంటూ యువత పెద్ద పెట్టున నినాదాలు చేశారు. డప్పులు, వాయిద్యాలతో ట్రాక్టర్లు, ఆటోలు, ఎద్దుల బండ్లు, తోపుడు బండ్లలో వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.

పుట్లూరు: జై బోలో గణపతి మహరాజ్‌కి జై...గణపతి బప్పా మోరియా తదితర గణపతి నామస్మరణలతో గ్రామాల్లోని వీధులు మార్మోగాయి. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గణేష్ నిమజ్జన కార్యక్రమాలు కొనసాగాయి. వినాయక మండపాల వద్ద లడ్డూల వేలం పాట నిర్వహించారు. పుట్లూరు సీఐ సుబ్రమణ్యం సిబ్బందితో కలిసి బందోబస్తు ఏర్పాటు చేశారు.

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని కోట, వంక వీధి, నరసింహస్వామి, కాయల గేరి , న్యూ కాలనీల్లో వినాయక ప్రతిమలను బుధవారం నిమజ్జనం చేశారు. ఉదయం నుంచి స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం వినాయక ప్రతిమలను ట్రాక్టర్లపై పెట్టుకొని గ్రామంలోని పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి పెద్దవంక లో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నైరుతిరెడ్డి ఆధ్వర్యంలో అల్పాహారం..

శోభాయాత్రను వీక్షించేందుకు వచ్చిన వందలాది మంది భక్తాదులకు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి వైవీఆర్ క్యాంటీన్ వద్ద అల్పాహారాన్ని, వాటర్‌బాటిళ్లను అందజేశారు. అలాగే వైద్యురాలు హిమబిందు అల్పాహారాన్ని పంపిణీ చేశారు.

శింగనమల: మండలంలో బుధవారం వినాయక నిమజ్జనం వైభవంగా జరిగింది. మండల కేంద్రంతోపాటు గోవిందరాయునిపేట, సోదనపల్లి, సలకంచెరువు, నాయనవారిపల్లి, రాచేపల్లి, తరిమెల, గుమ్మేపల్లి, ఆకులేడు, లోలూరు, వెస్ట్ నరసాపురం, చిన్నజలాలపురం, శివపురం, సీ.బండమీదపల్లి, పెరవలి, ఉల్లికల్లు, కొరివిపల్లి గ్రామాల్లో స్వాములను ఘనంగా ఊరేగించారు. ఈసందర్భంగా చిన్నాపెద్దా తేడా లేకుండా చిందులు వేశారు. అనంతరం శింగనమల చెరువులో విగ్రహాలను నిమజ్జనం చేశారు. గ్రామాల్లో ఎటువంటి సంఘటనలు జరగకుండా సీఐ అస్రార్ బాషా, ఏఎస్ఐ చితంబరయ్య ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

గుత్తి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం వినాయక నిమజ్జనం వైభవంగా జరిగింది. వినాయక విగ్రహాలను ట్రాక్టర్‌లో ఉంచి భారీ ర్యాలీతో నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా వినాయక మండపాల వద్ద అన్నదానం చేశారు. యువకులు రంగులు చల్లుకొని డప్పు వాయిద్యాలతో నృత్యాలు చేసుకుంటూ గ్రామంలో విగ్రహాలను ఊరేగించి గ్రామ శివారులోని కుంటల్లో నిమజ్జనం చేశారు. ఈసందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ రాజశేఖర్‌రెడ్డి, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.


పుట్లూరు: ఎల్లుట్లలో వినాయక నిమజ్జనం సందర్భంగా చిందులు వేస్తున్న యువకులు


శింగనమలలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం


గుంతకల్లులో గణనాథులను ఊరేగిస్తున్న భక్తులు

తాడిపత్రి: మండల వ్యాప్తంగా బుధవారం వినాయక నిమజ్జనం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి వినాయకుడి విగ్రహాల వద్ద జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మంటపాల అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం భజనలు, కోలాటాలు, ఆట, పాటలు, డప్పులతో వినాయక శోభాయాత్ర సాగింది. ఆలూరు, చీమలవాగుపల్లి, యర్రగుంటపల్లి ప్రాంతాల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. మండల వ్యాప్తంగా 140 వినాయక విగ్రహాలు నిమజ్జనానికి తరలివెళ్లాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా డీఎస్పీ సీఎం గంగయ్య ఆధ్వర్యంలో రూరల్ సీఐ లక్ష్మీకాంతారెడ్డి, ఎస్ఐ మహ్మద్ గౌస్ సిబ్బందితో కలసి చర్యలు చేపట్టారు.

గుంతకల్లు టౌన్: గణపతి బప్పా మోరియా..జై బోలో గణేష్ మహరాజ్ కీ జై అన్న నినాదాలతో గుంతకల్లు పుర వీధులు హోరెత్తాయి. బుధవారం సాయంత్రం నిర్వహించిన గణేశుడి శోభాయాత్ర కనుల పండువగా జరిగింది. శోభాయాత్రను తిలకించి తరించేందుకు భక్తాదులు పోటెత్తారు. నగర ఉత్సవ సమితి ఆధ్వర్యంలో స్థానిక రైల్వే గ్రౌండ్ వద్దనున్న వినాయక ఆలయంలో వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సకల విఘ్నాలన్నీ తొలగించి రాష్ట్రం సుభిక్షంగా, ప్రజలు సంతోషంగా జీవించేటట్టు ఆశీర్వదించాలని ఆదిదేవుడైన లంబోదరుడికి మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి పూజలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భవానీ కాషాయజెండాను ఊపి శోభాయాత్ర ప్రారంభించారు. ఊరేగింపుగా వందలాది విగ్రహాలు నిమజ్జనానికి తరలించారు. పాత గుంతకల్లులోని వినాయక ఘాట్‌లో వినాయక విగ్రహాలకు పూజలు నిర్వహించి జీఎస్‌బీసీ కెనాల్‌లో ప్రవహిస్తున్న నీటిలో నిమజ్జనం చేశారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, టూటౌన్ సీఐ గణేష్, నగర ఉత్సవ సమితి అధ్యక్ష,కార్యదర్శులు బండారు కృష్ణమూర్తి, ఇల్లూరు లక్ష్మీనారాయణ, సోమనాథ్, కౌన్సిలర్లు కెవి.నాగరత్న, పవన్‌గౌడ్, కృపాకర్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు గోపాజగదీష్ తదితరులు పాల్గొన్నారు. నిమజ్జనోత్సవంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్, విద్యుత్, అగ్నిమాపక, ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా బుధవారం వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు, యువకులు వినాయకుడికి పూజలు నిర్వహించారు. వినాయక ప్రతిమలను వాహనాలపై ఊరేగింపుగా తీసుకెళ్లి గార్లదిన్నె, కల్లూరు, మర్తాడులో హెచ్చెల్సీలో నిమజ్జనం చేశారు.

యాడికి: మండలవ్యాప్తంగా బుధవారం వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి వినాయక ప్రతిమలను వాహనాలపై వీధుల్లో ఊరేగించారు. ఈసందర్భంగా చిన్నాపెద్దా తేడా లేకుండా చిందులు వేశారు. వేముల పాడు గ్రామ సమీపంలో రాయలచెరువు, తాడిపత్రి రహదారిలో మోడల్ స్కూల్ ఎదురుగా ఉన్న వంక, ఆర్టీటీ చెక్ డ్యాం వద్ద వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. మండల కేంద్రంలో ఆసుపత్రి కాలనీలో ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహాన్ని పెద్దపప్పూరు మండలం చీమలవాగుపల్లె వద్ద ఏర్పాటు చేసిన ప్రాంతానికి తరలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ శంకర్ రెడ్డి, ఎస్ఐలు గురుప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఏఎస్ఐలు వెంకటేస్, రామాంజనేయులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వేములపాడు సర్పంచు ఓంకారమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు సాంబశివుడు పాల్గొన్నారు.

పామిడి: మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విఘ్నేశ్వరుని ప్రతిమలను ట్రాక్టర్లపై రాత్రి పొద్దుపోయేదాకా పురవీధుల్లో ఊరేగించారు. డప్పుల మోతల నడుమ యువత కేరింతలు కొడుతూ గణేష్ మహరాజ్‌కు జై అంటూ ముందుకు సాగారు.


శింగనమల చెరువులో వినాయకుడి నిమజ్జనం చేస్తున్న దృశ్యం


గార్లదిన్నెలో నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయక విగ్రహం

అనంతరం వినాయక ప్రతిమలను పొగరూరు గ్రామ సమీపంలోని పెన్నానదికి తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఈసందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ ఎం రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. పామిడిలోని ఎద్దులపల్లి రోడ్డులో కృషి వినాయక ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో గణేష్ లడ్డూకు వేలంపాట నిర్వహించారు. అరుణ్ అనే వ్యక్తి 15 కేజీల స్వామి లడ్డూను రూ.40 వేలకు దక్కించుకున్నాడు.

యల్లనూరు: చింతకమండ, గొడ్డుమర్రి, తిమ్మంపల్లి, పాతపల్లి, యల్లనూరు తదితర గ్రామాల్లో వినాయక నిమజ్జనం బుధవారం వైభవంగా జరిగింది. విగ్రహాల వద్ద అన్నదానం నిర్వహించారు. పుర వీధుల్లో వినాయకులను ఊరేగించారు. సీఐ సుబ్రహణ్యం,ఎస్ఐ రామకృష్ణ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

పెద్దపప్పూరు: చీమలవాగుపల్లి బైపాస్ సమీపంలోని నీటికుంట వద్ద బుధవారం తాడిపత్రి, యాడికి, పెద్దపప్పూరు మండలాలకు చెందిన వినాయక ప్రతిమలను నిమజ్జనం చేశారు. తాడిపత్రి డీఎస్పీ గంగయ్య, యాడికి సీఐ శంకర్‌రెడ్డి, ఎస్ఐలు ఖాజాహుస్సేన్, మహ్మద్ గౌస్, గురుప్రసాద్‌రెడ్డి తదితరులు ఎటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా పర్యవేక్షించారు. పసలూరులో రెండు వర్గాల మధ్య వినాయకుడి ఊరిగింపు సందర్భంగా చిన్నపాటి సమస్య చోటుచేసుకోవడంతో పోలీసులు రంగప్రవేశం చేయడంతో పరిస్థితి సద్దుమణిగింది. అనంతరం పోలీసులే స్వయంగా రెండు విగ్రహాలను చాగల్లు ప్రాజెక్టులో నిమజ్జనం చేశారు.

లడ్డూ వేలం రూ.36,200

కల్లూరులో వినాయక చవితికి ఏర్పాటు చేసిన లడ్డూ వేలం పాటలో రూ.36,200 పలికింది. వినాయక కమిటీ సభ్యులు స్వామి వారి లడ్డూకు వేలం నిర్వహించగా గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత కొండయాదవ్ రూ.36,200కు సొంతం చేసుకున్నారు. అనంతరం వినాయకుడి విగ్రహాన్ని ఊరేగించి నిమజ్జనం చేశారు.


గుంతకల్లులో గణేశుడి శోభాయాత్ర


యాడికి: చందనలో యువకుల సందడి


యాడికి: వేములపాడులోని ఆర్టీటీ చెక్ డ్యామ్ వద్ద వినాయక నిమజ్జన దృశ్యం


గుత్తి రూరల్: నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు


గుంతకల్లులో గణేశ విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం


తాడిపత్రి: కుంటలో బొజ్జగణపయ్యను నిమజ్జనం చేస్తున్న యువకులు


తాడిపత్రి: ఆర్టీటీ కాలనీలో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు, మహిళలు


గుత్తిలో వినాయక నిమజ్జనానికి ముందు పూజల్లో పాల్గొన్న భక్తులు


రథాన్ని నడుపుతున్న వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, శోభాయాత్రను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ భవాని


పెద్దవడుగూరు : వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం


గుంతకల్లు టౌన్ : వినాయక ఘాట్‌లో విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం


పామిడిలో గణపయ్యను నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

పార్కుల అభివృద్ధికి చర్యలు చేపట్టండి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని మోదినాబాద్, హంపయ్య కాలనీలోనున్న మున్సిపల్ పార్కుల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. బుధవారం ఉదయం కమిషనర్, ఎంఈ గురప్పయాదవ్, మాజీ చైర్మన్ రామలింగప్ప పార్కులను పరిశీలించారు. ఆహ్లాదాన్ని పంచే చెట్ల పెంపకంతో పాటు స్థానిక ప్రజలు వాకింగ్ చేసుకునేందుకు వాకింగ్ ట్రాక్, ఫిట్‌నెస్, పిల్లలు ఆడుకునే ఎక్విప్‌మెంట్‌ను ఏర్పాటు చేయాలని కమిషనర్ తెలియజేశారు. డీఈ హేమచంద్ర, ఏఈ హరికృష్ణ, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ పరుశురాముడు ఉన్నారు.




పార్క్ అభివృద్ధి పనులపై చర్చిస్తున్న కమిషనర్

నిత్యావసరాల పంపిణీ


నిత్యావసరాలు అందిస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: అవయవ దానం చేసిన జగదీష్ కుటుంబానికి నిత్య సురభి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని హైస్కూల్ కొట్టాలకు చెందిన జగదీష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంగతి తెలిసిందే. ట్రస్ట్ చైర్ పర్సన్ నిర్మల మురళి మాట్లాడుతూ జగదీష్ ప్రాణం పోయినా అవయవ దానం ద్వారా జీవించారన్నారు. నిత్య సురభి చారిటబుల్ ట్రస్ట్, సాయి ఆదిత్య కన్‌స్ట్రక్షన్ అధినేత పురుషోత్తం, మురళీకృష్ణ సౌజన్యంతో రూ.10 వేల విలువ చేసే నిత్యావసరాలు, 10 వేలు నగదు జగదీష్ కుటుంబానికి అందజేశారు. జగదీష్ భార్య రోజా, తండ్రి నరసింహులు, ట్రస్ట్ సభ్యులు కవిన్, ఆదిత్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన వేణుగోపాల్, చిన్నారి ఓం నందన్ నాయక్

గుత్తి: పట్టణ శివారులోని ఎస్కేడీ ఇంజనీరింగ్ కాలేజీ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. పామిడికి చెందిన వేణుగోపాల్, సుజాత దంపతులతో పాటు సీజీ తాండాకు చెందిన తులసి ఆమె నాలుగేళ్ల కుమారుడు ఓం నందన్ నాయక్ పామిడి నుంచి ఆటోలో గుత్తికి బయలుదేరారు. అయితే ఎస్కేడీ ఇంజనీరింగ్ కాలేజీ వద్ద ఒక్కసారిగా ఎద్దులు రోడ్డుపైకి వచ్చాయి. ఎద్దులను తప్పించబోయి ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఆటోలో ఉన్న నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. 108లో క్షతగాత్రులను గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

అండర్ డ్రైనేజీ మరమ్మతు త్వరగా పూర్తి చేయండి

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అండర్ డ్రైనేజీ మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి సూచించారు. బుధవారం పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ నుంచి దుర్గా హోటల్‌కు వెళ్లే దారిలో చేపడుతున్న అండర్ డ్రైనేజీ మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. మ్యాన్‌హోల్స్ దెబ్బతిని ఉంటే వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. మురుగునీరు అండర్ డ్రైనేజీలో బ్లాక్ కాకుండా ఎప్పటికప్పుడు పునరుద్ధరించాలని సూచించారు. ఆయన వెంట కౌన్సిలర్ రాబర్ట్, నాయకులు సూర్య ప్రభాకర్‌బాబు, జావిద్, బాబా తదితరులు ఉన్నారు.


మ్యాన్‌హోల్ వద్ద మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

విద్యుత్ ఉద్యోగులతో సమావేశం

గుత్తి: పట్టణంలోని ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈ కార్యాలయం ఆవరణలో బుధవారం ఏపీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ సుబ్బరాజు విద్యుత్ ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై చర్చించారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కారం చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

23న తలనీలాల సేకరణకు వేలం

గుత్తి రూరల్: తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథ స్వామి ఆలయంలో తలనీలాల సేకరణకు ఈ నెల 23న వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఓ దేవదాసు బుధవారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.20వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. వివరాలకు ఆలయంలో సంప్రదించాలని ఈఓ సూచించారు.

సైబర్ మోసాలపై జాగ్రత్త

తాడిపత్రి అర్బన్: సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ సూచించారు. బుధవారం ఆయన స్థానిక సాయిసిద్ధార్థ జూనియర్ కళాశాలలో సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లు వాడే క్రమంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనవసర లింక్‌లను క్లిక్ చేయడంతో కలిగే అనర్థాలను వివరించారు.

వైఎస్సార్‌బీమా తక్షణ సాయం అందజేత

పామిడి: ఇటీవల మృతిచెందిన 15వ వార్డు వాసి నూర్‌మహమ్మద్ కుటుంబానికి బుధవారం వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేల నగదు అందజేశారు. పట్టణ సచివాలయాల కన్వీనర్ బీ ఆసిఫ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందిన రామరాజుపల్లి వాసి పీ ముత్యాల్‌రెడ్డి మృతదేహానికి ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బయపరెడ్డి, వెంకట్రామిరెడ్డి, రమణారెడ్డి, ఓబులేసు, దామోదర్‌రెడ్డి, రామశేఖర్‌రెడ్డి తదితరులు ఘన నివాళులర్పించారు. మృతుని కుటుంబసభ్యులను వారు పరామర్శించారు.